

చెంచుగిరిజనుల ఆర్థికాభివృద్ధికి కృషి

చెంచు గిరిజనుల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పాటుపడుతున్నారని ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావు అన్నారు.

-10లో..



దివ్యాంగులకు ప్రభుత్వం చేయూత

దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా చేయూతనందిస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు.

-10లో..

గరిష్టం/కనిష్టం
30/22

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మంత్రి సురేష్‌ను కలిసిన ఎస్టీ కమిషన్ చైర్మన్



మంత్రి సురేష్‌కు బొకే అందిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావు

మార్కాపురం: రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను ఆదివారం మార్కాపురంలోని డాక్టర్ సామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్టీ కమిషన్ చైర్మన్ డివిజి శంకర్‌రావు, సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి మంత్రిని సన్మానించారు. రాష్ట్రంలో ఎస్టీ కమిషన్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను మంత్రికి తెలిపారు. కాగా ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను స్థానిక పంచాయతీ రాజ్ గెస్టు హౌస్‌లో మార్కాపురం డివిజన్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు భూదాలా గురవయ్య, ఆదిమూలపు అనీల్‌రాజు లూకా సన్మానించారు.

ఘనంగా భారత నౌకాదళ దినోత్సవం

ఒంగోలు సెంట్రల్: భారత నౌకాదళ దినోత్సవాన్ని ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఆలపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన సభ నిర్వహించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ పీఎస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నౌకాదళ దినోత్సవ ప్రాముఖ్యతను, ఇండో-పాక్ యుద్ధ సమయంలో ఆపరేషన్ ట్రై డెంట్ గురించి వివరించారు. జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి రజని, కిమ్స్ సీఈఓ అంజిరెడ్డి, డాక్టర్ అబ్బూరి రవీంద్రబాబు, నావికుడు తానికొండ వెంకట సుబ్బారావు, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు గోరంట్ల కోటేశ్వరరావులు పాల్గొని తమ అనుభవాలను వివరించారు. కూచిపూడి నృత్యం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.




నౌకాదళ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న కల్నల్ పీఎస్ రెడ్డి

తీరం అప్రమత్తం

తుఫాన్ వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుఫాన్ ఈనెల 5న నెల్లూరు–బాపట్ల మధ్య తీరం దాటే అవకాశం ఉండటంతో జిల్లా తీరప్రాంత మండలాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. పునరావాస కేంద్రాలను సిద్ధం చేయడంతో పాటు లోతట్టు, తీర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పంటలు నష్టపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులను అప్రమత్తం చేస్తున్నారు. కలెక్టరేట్‌లో 24 గంటలు అందుబాటులో ఉండేలా విపత్తు నిర్వహణ శాఖ కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు.

- తుఫాన్ జాగ్రత్త చర్యలు ముమ్మరం
- లోతట్టు, తీర ప్రాంతాలపై ప్రత్యేక చర్యలు
- పునరావాస కేంద్రాలు సిద్ధం చేసిన యంత్రాంగం
- కొత్తపట్నం తీర ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్
- రైతులను, మత్స్యకారులను అప్రమత్తం చేస్తున్న అధికారులు
- విద్యుత్, రవాణా శాఖల ముందస్తు జాగ్రత్త చర్యలు
- జిల్లాలో 13 మండలాల్లో వర్షపాతం నమోదు
- అత్యధికంగా కొత్తపట్నంలో 44.2 మి.మీ. వర్షం



సర్కిల్‌లో తుఫాన్ ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతం



కొత్తపట్నం తీరంలో ఒడ్డుకు చేర్చిన పడవలు

ఒంగోలు అర్బన్:

మిచాంగ్ తుఫాన్ ముంచుకొస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలు, సూచనల మేరకు అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుని సంసిద్ధమయ్యారు. తీర, లోతట్టు ప్రాంతాలు జలమయమైతే వారికి ఇబ్బందులు లేకుండా ఉండేలా పునరావాస కేంద్రాలను సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆదివారం



కొత్తపట్నం పల్లెపాలెంలో మత్స్యకారుని గృహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్



పాకల తీరంలో బోట్లలో భద్రపరచుకున్న వలలు

కలెక్టర్ స్వయంగా కొత్తపట్నం తీర ప్రాంతాల్లో పర్యటించి అక్కడ తీసుకుంటున్న జాగ్రత్త చర్యలను పర్యవేక్షించడంతో పాటు ప్రజలకు తగిన సూచనలు చేశారు. తుఫాన్ ప్రభావం ఏ స్థాయిలో ఉన్నా ప్రాణ, పశు నష్టం ఉండకూడదనే ఉద్దేశంతో జాగ్రత్త చర్యలను ముమ్మరం చేశారు. ఇప్పటికే విద్యుత్, రవాణా వ్యవస్థలు రంగంలోకి దిగి ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడ విద్యుత్ అంతరాయం ఏర్పడిన వెంటనే పునరుద్ధరించేలా సంసిద్ధంగా ఉన్నారు. పంట చేతికి వచ్చిన రైతులు పంటను రక్షించుకునేలా సంబంధిత శాఖల అధికారులు రైతులకు అవసరమైన సహకారాన్ని అందిస్తున్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా తగిన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో మొత్తం 46 తుఫాన్ రిలీఫ్ క్యాంపులు ఏర్పాటు చేశారు. వాటిలో ఒంగోలు మండలంలో 16, టంగుటూరులో 3, కొత్తపట్నంలో 19, నాగులుప్పలపాడులో 1, సింగరాయకొండలో 7 తుఫాన్ రిలీఫ్ షెల్టర్లు ఏర్పాటు చేశారు. వాటిలో ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. కొత్తపట్నం మండలంలో ఇప్పటికే 128 మందిని రిలీఫ్ క్యాంపులకు చేర్చారు. జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి విపత్తుల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఇప్పటికే 1077 నంబర్‌తో 24 గంటలు అందుబాటులో ఉండేలా కమాండ్ కంట్రోలు రూమును ఏర్పాటు చేశారు. మిచాంగ్ తుఫాన్ ఈ నెల 5వ తేదీ నెల్లూరు, బాపట్ల మధ్య తీరం దాటనున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. తీరందాటే సమయంలో గంటకు 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది.



కొత్తపట్నం తీరంలో అలల ఉధృతి

ఏ పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధం



మిచాంగ్ తుఫాన్ ప్రభావం ఏ మేరకు ఉన్నా ఏ పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంది. క్షేత్రస్థాయిలో తీర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు, ప్రజలకు తగిన సూచనలు చేశాం. స్వయంగా ముందస్తు జాగ్రత్త చర్యలను పర్యవేక్షిస్తున్నాం. ప్రజలు రెండు రోజుల పాటు ఇళ్లలో ఉండాలి. తుఫాన్‌కు సంబంధించి ఏ ఇబ్బందులు ఉన్నా కంట్రోలు రూముకు తెలియచేయాలి. తీర, ముంపు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా తుఫాన్ షెల్టర్లను సిద్ధం చేశాం. విద్యుత్, రవాణా వ్యవస్థలను అలర్ట్ చేశాం. అన్నీ శాఖలు సమన్వయంతో పనిచేసి తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేలా సర్వం సిద్ధం చేశాం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్

జిల్లాలో వర్షపాతం 157.6 మి.మీలు

- అత్యధికంగా కొత్తపట్నంలో 58.8 మి.మీలు

ఒంగోలు సెంట్రల్: మిచాంగ్ తుఫాన్ వల్ల జిల్లాలో 38 మండలాలకు గాను 14 మండలాల్లో వర్షపాతం నమోదైంది. వాతావరణం చల్లగా మారి గాలులు వీస్తున్నాయి. ఆదివారం అత్యధికంగా కొత్తపట్నం మండలంలో 58.8 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా సరాసరి 4.1 గా నమోదైంది. అందులో టంగుటూరు 20.8, సింగరాయకొండ 18.8, ఒంగోలు 15.8 మి.మీ, పొన్నలూరు 11.6, కొండపి 8.4, పీసీపల్లి 8, వెలిగండ్ల 4.2, సీఎస్‌పురం 3.2, జరుగుమల్లి 2.4, మద్దిపాడు 2.2, ఎస్ఎన్‌పాడు 2, పామూరు 1, ఎన్‌జీపాడు 0.4 మి.మీలుగా నమోదైనట్లు జిల్లా ఏఎస్‌ఓ శైలజ తెలిపారు.



పాకల పల్లెపాలెంలో మత్స్యకారులు భద్రపరుచుకున్న వలలను పరిశీలిస్తున్న మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్‌రెడ్డి



కొత్తపట్నం తీరంలో కోస్టుగార్డు సిబ్బంది పహారా

నేడు, రేపు విద్యాసంస్థలకు సెలవు

- సమ్మెటివ్ పరీక్షలు ఈనెల 11, 12కు వాయిదా
- జూనియర్ కాలేజీలకు కూడా సెలవు

ఒంగోలు: మిచాంగ్ తుఫాన్ తీవ్రత దృష్ట్యా ఈనెల 11, 12 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని యాజమాన్యాల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని డీఈవో వీఎస్ సుబ్బారావు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి ఎవరూ పాఠశాలలు నిర్వహించవద్దని ఆదేశించారు. ప్రస్తుతం సమ్మెటివ్ పరీక్షలు ప్రారంభమైన దృష్ట్యా ఈనెల 4వ తేదీ జరగాల్సిన గణితం పరీక్షను ఈనెల 11వ తేదీకి, 5వ తేదీ జరగాల్సిన టోఫెల్ పరీక్షను ఈనెల 12వ తేదీన నిర్వహించాలన్నారు. తుఫాన్ దృష్ట్యా నాడు–నేడు పనులు జరుగుతున్న పాఠశాల భవనాల్లో, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఎవరూ ఉండరాదని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులను డీఈవో ఆదేశించారు. అదే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాఠశాలల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితి దృష్ట్యా ఉపాధ్యాయులంతా అందుబాటులో ఉండాలని, ఎవరికీ ఎటువంటి సెలవులు మంజూరు చేయరన్నారు.

జూనియర్ కాలేజీలకు నేడు, రేపు సెలవు

తుఫాన్ కారణంగా సోమ, మంగళవారాల్లో జిల్లావ్యాప్తంగా అన్ని జూనియర్ కాలేజీలకు సెలవు ప్రకటించినట్లు ఆర్ఐవో ఎ.సైమన్ విక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సమన్వయంతో తుఫాన్‌ను ఎదుర్కొందాం

- కలెక్టర్ దినేష్ కుమార్

కొత్తపట్నం: మిచాంగ్ తుఫాన్ ప్రభావ తీవ్రతను ఎదుర్కోవడానికి అధికారులంతా సమయన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఏస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కె.పల్లెపాలెం బీచ్ ప్రాంతంలో పర్యటించారు. తుఫాన్ దృష్ట్యా స్థానిక అధికారులు చేపడుతున్న చర్యలను పరిశీలించారు. తీరప్రాంతంలో ఉన్న మత్స్యకారులు, కుటుంబ సభ్యులతో తుఫాన్ గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోమ, మంగళవారాల్లో తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంటుందని వాతావరణ హెచ్చరికల దృష్ట్యా తీర ప్రాంతంలోని తుఫాన్ షల్టర్ కేంద్రాలు, పాఠశాల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. తీర ప్రాంతంలో 19 గ్రామాల్లో పూరిళ్లు, ప్రమాదకర స్థితిలోని పురాతన ఇళ్లల్లో ఉంటున్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారని వివరించారు. అక్కడకు తరలించిన జనానికి అవసరమైన భోజనాలు, తాగునీటి వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. తుఫాన్ తీవ్రత తగ్గే వరకు మత్స్యకారులెవరూ సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందు జాగ్రత్తగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తీర ప్రాంతంలోని పరిస్థితి



మత్స్యకారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

రెవెన్యూ, మత్స్యశాఖ, పంచాయతీరాజ్ శాఖ సిబ్బందితో పాటు స్థానిక పోలీసులు మెరైన్ పోలీసులు, మెడికల్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం సూచనలు, సలహాలు పాటించాలని మత్స్యకారులకు సూచించారు. వేటసామగ్రి వలలు, పడవలు, ఇంజన్లు, బోట్లు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. పూరిళ్లలో ఉంటున్న ప్రజలకు ప్రభుత్వం ద్వారా పక్కా ఇళ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు

మిచాంగ్ తుఫాన్ హెచ్చరికలు నేపథ్యంలో అవసరమైన సహాయక చర్యల కోసం రాష్ట్ర విపత్తుల స్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్) నుంచి రెండు బృందాలు జిల్లాకు వచ్చాయని కలెక్టర్ చెప్పారు. వీరిలో 21 మంది ఒంగోలు, 23 మంది సింగరాయకొండ మండలం పాకలలో అందుబాటులో ఉంచామన్నారు. అత్యవసర పరిస్థితిల్లో సహాయం కోసం కలెక్టర్ కార్యాలయంలో కంట్రోలు రూము ఏర్పాటు చేశారన్నారు.

ఓటర్ల జాబితా సవరణ పక్కాగా నిర్వహించాలి

మత్స్యకారులకు తుఫాన్ ప్రభావంపై సూచనలిచ్చిన అనంతరం కొత్తపట్నం బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సవరణ స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్న బీఎల్‌వోల పనితీరును స్వయంగా తనిఖీ చేశారు. ఓటర్ల జాబితాలో కొత్తగా పేర్లు నమోదు, సవరణ కోసం దరఖాస్తులు వస్తున్న తీరును పరిశీలించారు. విధుల నిర్వహణలో అప్రత్తంగా ఉండాలని, సక్రమంగా పనిచేయని బీఎల్‌వోలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూడాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కె.పల్లెపాలెం తుఫాన్ షల్టర్‌లో ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనంద్‌రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 17 సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. పథకాలన్నీ అర్హులందరికీ చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఆవుల చంద్రశేఖర్ రెడ్డి, తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీవో డాక్టర్ సుజాత, ఏపీవో రత్నజ్యోత్స్న, పీహెచ్ డాక్టర్ వైష్ణవి, ఏపీఎం షేక్ రజియాసుల్తాన్ బేగం, పీఆర్ఏఈ శేషగిరిరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కృష్ణారెడ్డి, ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య, హౌసింగ్ ఏఈ అన్నం నాంచార్లరెడ్డి తదితరులు ఉన్నారు.



సురక్షలో కౌలు రైతు కార్డు అందుకున్నా..



గ్రామంలో పొలం కౌలుకి తీసుకొని పంట సాగిస్తున్నా. జగనన్న సురక్ష కార్యక్రమంలో పంట సాగు హక్కు పత్రం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకోగా వలంటీరు వచ్చి అవసరమైన సర్టిఫికెట్లు తీసుకొని ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పంట సాగు హక్కు పత్రం అందించారు. ఇక నుంచి పంట నష్ట పరిహారం, తదితర ప్రభుత్వ పథకాలకు అర్హుడినవుతాను. జగనన్న పది కాలాలు ముఖ్యమంత్రిగా ఉండాలి.

– అత్తంటి హరిబాబు, జమ్ములపాలెం, టంగుటూరు మండలం


వైఎస్ఆర్ జలకళతో పొలం సాగు చేసుకుంటున్నా..



వైఎస్ఆర్ జలకళ పథకం కింద ఉచితంగా బోరు వేశారు. నీరు సమృద్ధిగా పడ్డాయి. వర్షాభావ పరిస్థితుల్లో పంటలు పండించుకోలేక పొలాలు బీడుగా ఉంచాం. నేడు వైఎస్ఆర్ జలకళతో బోరు ద్వారా పంటలు పండించుకుంటున్నాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మా కుటుంబం తరఫున కృతజ్ఞతలు.

– దగ్గుల వెంకటేశ్వరరెడ్డి, ఎస్ఎన్‌పల్లి

కలలో కూడా సొంతింటిని నిర్మించుకుంటాననుకోలేదు



చాపలు పట్టి అమ్ముకొని జీవనం సాగిస్తున్నాం. మాకు ఇద్దరు పిల్లలు. వారి చదువులకు ఫీజులు, ఇంటి అద్దె, ఖర్చులు అన్నీ కలిపి నెలకు సుమారు రూ.10 వేలు వస్తుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ పక్కా ఇల్లు అనే పథకాన్ని ప్రవేశపెట్టారు. నేరుగా మా ఇంటికి సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు వచ్చి ఎంక్వయిరీ చేసి గృహానికి అర్హులయ్యారని చెప్పారు. పట్టణ శివారులో చెన్నరాయునిపల్లి లేఅవుట్‌లో మాకు ఇంటి స్థలాన్ని మంజూరు చేశారు. హౌసింగ్ విభాగం వారు మాకు అన్నీవిధాలా సహకరించారు. అందులో ఇల్లు కట్టుకుని త్వరలో గృహప్రవేశం చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాం. జగనన్న చేసిన మేలును ఎన్నటికీ మర్చిపోలేం.

– గోగు రామలక్ష్మి, బెస్తకాలనీ, మార్కాపురం

రెడ్లలో సేవా గుణం మిన్న



మాట్లాడుతున్న మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

పెద్దారవీడు: రెడ్లలో సేవా గుణం ఎక్కువని, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని దేవరాజుగట్టు గ్రామ సమీపంలోని కాశినాయన ఆశ్రమంలో మార్కాపురం నియోజకవర్గ రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన మహోత్సవం వైభవంగా ఆదివారం నిర్వహించారు. ఆశ్రమంలో అర్చకులు బీవీ దత్తయ్య ఆధ్వర్యంలో కాశినాయన, శివలింగం, నాగమయ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక పరంగా ఐక్యతను చాటడానికి ఇలాంటి వన సమారాధనలు ఉపకరిస్తాయన్నారు. కార్తీక వన సమారాధనలతో ఆధ్యాత్మికతతో పాటు సమష్టిగా ముందుకెళ్లాలనే భావన కలుగుతాయన్నారు. మానవత సేవ సంఘం కార్యక్రమాలను విస్తృతపర్చి పేదలకు మరింత మెరుగైన సేవలను అందించాలన్నారు. రెడ్డి సేవా సంఘం చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. శ్రీశైలం మల్లికార్జునస్వామి దేవస్థానం కమిటీ మెంబర్, కౌన్సిలర్ డాక్టర్ చెప్పలి కనకదుర్గ మాట్లాడుతూ ఆశ్రమంలో ఉన్న గోవుల దాణా కోసం ప్రతి నెలా రూ.10 వేలు ఇస్తానని ప్రకటించారు. వీహెచ్ఆర్ కళాశాల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి, మార్కాపురం మార్కెట్ యార్డు చైర్మన్ గొల్మారి శ్రీనివాసరెడ్డి, ఏపీ రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిజ్జ్రు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర షోషల్ మీడియా కన్వీనర్ తూముకుంట ప్రతాపరెడ్డి మాట్లాడారు. వన భోజనాలకు హాజరైన ప్రముఖులకు శాలువ, మెమొంటో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. మహిళలచే కోలాటం, భరత నాట్యం, సంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా ఆకర్షణగా నిలిచాయి. రెడ్డి వంశీయుల చరిత్ర బుర్రకథ రూపంలో వివరించారు. వివిధ రకాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి భార్య సబ్బమ్మ, ప్రముఖల కుటుంబ సభ్యులు, పట్టణ, పరిసరాల గ్రామాలకు చెందిన రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి



మహిళల కోలాటం

క్లుప్తంగా

నేటి కలెక్టర్ స్పందన రద్దు

ఒంగోలు అర్బన్: కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఈ సోమవారం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో స్పందన రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించి జిల్లా కేంద్రానికి రావద్దని సూచించారు.

లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ఎస్పీ మలికాగర్గ్


ఎస్పీ (ఫైల్)

ఒంగోలు టౌన్: మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నామని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక బలగాలతో బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైె ప్రాంతాల్లో సహాయక శిబిరాలను, పునరావస కేంద్రాలను ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సముద్ర తీరాల్లో నివసిస్తున్న ప్రజలు పోలీసు, రెవెన్యూ అధికారులు సూచనలను పాటించాలని, ఆయా ప్రాంతాలను ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు కానీ, సమీపంలోని తుఫాన్ షెల్టర్లకు కానీ వెళ్లాలన్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో ఈదురుగాలులకు రోడ్ల మీద విరిగిపడిన చెట్లను వెంటనే తొలగించి ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూడాలని, అవసరమైతే ట్రాఫిక్‌ను మళ్లించాలని సూచించారు. ప్రయాణించేందుకు అనువుగా లేని మార్గాల్లో, నీట మునిగిన రహదారులను మూసివేయాలని, ప్రత్యామ్నాయ మార్గాల గుండా వాహనాలు ప్రయాణించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నదీ పరివాహక ప్రాంతాల వద్ద ముమ్మరంగా గస్తీ నిర్వహించాలన్నారు. మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దన్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని జిల్లాలో సముద్రస్నానాలు ఆచరించే భక్తులు, తీరప్రాంతాలను వీక్షించేందుకు వచ్చే పర్యాటకులు తుఫాన్ కారణంగా సముద్రం వద్దకు వెళ్లకుండా ఉండాలన్నారు. అత్యవసరం పరిస్థితుల్లో తక్షణ సహాయం కోసం డయల్ 112, పోలీసు వాట్సప్ నంబర్ 9121102266కు కానీ, స్థానిక పోలీసు అధికారులకు కాని సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

నేడు చెంచులతో ముఖాముఖి

యర్రగొండపాలెం: మండలంలోని వెంకటాద్రిపాలెం ప్రాంతంలోని చెంచులతో సోమవారం జరిగే ముఖాముఖిలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు పాల్గొంటారని మంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ముందుగా ఎస్టీ కమిషన్ ఉదయం 8.30 గంటల నుంచి చెంచు పునరావాస కాలనీ, హనుమంతుని గూడెంలలో పర్యటిస్తారు. పునరావాస కాలనీలో పోలీస్, అటవీ శాఖ, రెవెన్యూ, ఐటీడీఏ అధికారులు, సిబ్బందితో గిరిజనులకు ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో ఆయన పాల్గొంటారు. అనంతరం హనుమంతుని గూడెం ఆశ్రమ పాఠశాలను ఎస్టీ కమిషన్ చైర్మన్ తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తారని పేర్కొన్నారు.

చెంచుగిరిజనుల ఆర్థికాభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ శంకరరావు


గిరిజన దేవతలకు పూజలు చేస్తున్న కమీషన్ సభ్యులు

● గిరిజనుల జీవితాల్లో వెలుగు నింపేందుకే ఆర్వోఎఫ్ఆర్ భూములు
● ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్‌రావు
● అభయారణ్యంలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటన

పెద్దదోర్నాల: చెంచు గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పాటు పడుతున్నారని ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు అన్నారు. మండల పరిధిలోని నల్లమల అభయారణ్యంలోని లోతట్టు అటవీ ప్రాంతమైన మర్రిపాలెం, ఇష్టకామేశ్వరి ఆలయాలతో పాటు బయ్యన్నసెల, తుమ్మలబైలు తదితర ప్రాంతాల్లో ఆదివారం ఎస్టీ కమిషన్ సభ్యులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మర్రిపాలెంలో పర్యటించిన ఆయన చెంచు గిరిజనులతో మాట్లాడుతూ ఆదివాసీలు అనాదిగా అటవీ సంపదను కాపాడే అటవీ తల్లి ముద్దుబిడ్డలని కొనియాడారు. ఆదివాసీలు ఎప్పుడు చదువుకు పెద్దపీట వేస్తారో అప్పుడే అభివృద్ధి వారి వెంట ఉంటుందన్నారు. పనులు కాస్త మందకొడిగా జరిగినప్పుడు దాన్ని ముందుకు తీసుకెళ్లేందుకే ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. వనాలు, వన్యప్రాణులను అనునిత్యం కాపాడుతూ అటవీ సంరక్షణకు నిరంతర పాటుపడుతున్న చెంచు గిరిజనులు అభినందనీయులన్నారు. ప్రభుత్వం గిరిజన అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. చెంచు గిరిజనుల కోసం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వం ఎన్నో అంశాలకు ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. ఆరోగ్యం, విద్య, ఉపాధిపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. చిన్న రోగాలకే ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిరిజనుల కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపట్టిందన్నారు. గతంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న గిరిజనుల కోసం మండల కేంద్రం పెద్దదోర్నాలలో సుమారు రూ.50 కోట్లతో గిరిజన సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను, మార్కాపురంలో మెడికల్ కళాశాలతో పాటు యర్రగొండపాలెంలో రూ.26 కోట్లతో 100 పడకల వైద్యశాల, మండల కేంద్రంలో రూ.3 కోట్లతో మాతా శిశు ఆరోగ్యకేంద్రాలను నిర్మించారన్నారు. దీని వల్ల నల్లమల పరిధిలోని చెంచు గిరిజనులకు మెరుగైన వైద్యం అందుతోందన్నారు. 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి అటవీహక్కుల చట్టం ఏర్పాటు చేసి గిరిజనులు సాగు చేసుకునే భూములపై వారికే హక్కు కల్పించారన్నారు. అప్పటి నుంచి ఐటీడీఏ శ్రీశైలం పరిధిలోని ప్రకాశం, కర్నూలు, గుంటూరు జిల్లాలో ఎన్నో వేల మంది చెంచు రైతులకు అటవీ భూమిని పంపిణీ చేశామని తెలిపారు. మర్రిపాలెంలో సుమారు 600 ఎకరాల భూములు అటవీ హక్కుల చట్టంతో చెంచు గిరిజనులకు స్వంతమయ్యాయన్నారు. బాగా వెనుకబడ్డ ప్రాంతాల్లో ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు సక్రమంగా అందాయన్నారు. గతంలోనే అడవుల్లో నివసిస్తున్న చెంచు కుటుంబాలకు ఇంటి స్థలాల పట్టాలు మంజూరు చేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ చైర్మన్ సభ్యులకు చెంచు గిరిజనులు సాంప్రదాయ నృత్యాలు డప్పుల కోలాహలంతో స్వాగతం పలికారు. చెంచు గిరిజనుల ఆరాధ్య దేవతలకు చైర్మన్, సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి, ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా సోమసుందర్ నాయక్, మత్స్యకార విశ్వేశ్వరాజు, కొర్ర రాము, జంపరంగిలిల్లీ, బిచ్చడి మురళి, అధికారులు పాల్గొన్నారు.


ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్

దివ్యాంగులకు ప్రభుత్వం చేయూత

● జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు సెంట్రల్: దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని విధాలా చేయూతనిస్తోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన వేడుకల్లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు అర్చన అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇవ్వని కాంక్లియర్ ప్లాంట్‌ను సైతం ఇచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. సభలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. దివ్యాంగులు మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగాలన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఒంగోలులో దివ్యాంగులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. సభా అధ్యక్షురాలు అర్చన, మెప్మా పీడీ రవికుమార్, బ్యాంక్ ఎల్‌డీఎం అబ్దుల్ రహీమ్, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ ధనలక్ష్మిలు ఆయా శాఖలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. దివ్యాంగ సంఘ నాయకులు శ్రీనివాసరెడ్డి, రాజేంద్రలు పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. పరిష్కారానికి కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులు సూచనలు చేశారు.

ఉద్యోగ నియామక పత్రాల అందజేత

ఈ సందర్భంగా 8 మంది దివ్యాంగులకు ప్రభుత్వ ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు. 8 మంది దివ్యాంగులకు రూ. 52 వేల విలువైన ట్రై సైకిళ్లు, మూడు వీల్‌చైర్స్ అందజేశారు. మహిళల జీవనోపాధులు పెంపుదలకు దాత మైనంపాడు వాసి సౌర్యతేజ ఆయిల్‌ఫిల్లింగ్ స్టేషన్ యజమాని హరిప్రసాద్ రూ.35 వేల విలువైన కుట్టుమిషన్లు అందజేశారు. వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

హత్య చేసి..ఆత్మహత్యగా చిత్రీకరణకు యత్నం


అంకయ్య మృతదేహం


నిందితురాలు లక్ష్మమ్మ


రోదిస్తున్న మృతుని భార్య, కుటుంబసభ్యులు

కురిచేడు: వివాహేతర సంబంధం కొనసాగిన వ్యక్తితో ఆర్థిక లావాదేవీల విషయంలో గొడవ పడి హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. ఈ సంఘటన మండలంలోని బోయపాలెంలో వెలుగు చూసింది. ఎస్సై యం దేవకుమార్ తెలిపిన వివరాల మేరకు..స్థానిక బోయపాలెం గ్రామానికి చెందిన రేకుల పెద్ద అంకయ్య(40)కు అదే ప్రాంతానికి చెందిన బొనిగల లక్ష్మమ్మతో వివాహేతర సంబంధం ఉంది. ఈ క్రమంలో అంకయ్య, లక్ష్మమ్మకు మధ్య నగదు ఇచ్చిపుచ్చుకునే క్రమంలో శనివారం రాత్రి గొడవ జరిగింది. అంకయ్య లక్ష్మమ్మపై చేయి చేసుకోవడంతో ఆమె ఆగ్రహానికి గురై అంకయ్య మర్మాంగాలపై దాడి చేసింది. దీంతో అంకయ్య కిందపడి తలకు గాయాలయ్యాయి. దీంతో ఇంట్లోనే ఉన్న కుమారుడు ఏడుకొండలుతో కలిసి రోకలిబండతో తలపై కొట్టడంతో అంకయ్య మృతి చెందాడు. వెంటనే ఇద్దరూ కలిసి అంకయ్యకు ఉరేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే తెల్లారడంతో ఇద్దరూ అక్కడ నుంచి పరారయ్యారు. అయితే పెద్ద అంకయ్య శనివారం రాత్రి లక్ష్మమ్మ ఇంటికి వెళ్లడాన్ని గమనించిన తమ్ముడు..తెల్లారినా ఇంటికి రాకపోవడంతో లక్ష్మమ్మ ఇంటికి వెళ్లగా అంకయ్య మృతదేహం కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం బస్టాండ్‌లో ఉన్న లక్ష్మమ్మను అదుపులోనికి తీసుకొని సంఘటనా స్థలానికి తీసుకురాగా..ఆమె కుమారుడు పరారయ్యాడు. ఈ సమయంలో మృతుని కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి భారీగా తరలివచ్చారు. అనంతరం ఎస్సై ఎం దేవకుమార్ లక్ష్మమ్మను విచారించి స్టేషన్‌కు తరలించారు. ఎస్సై ఎం దేవకుమార్ కేసు నమోదు చేయగా సీఐ పాపారావు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఫెన్సింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక


రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు


ఫెన్సింగ్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఒంగోలు: ఫెన్సింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అండర్ 14, అండర్ 17 క్రీడాకారుల ఎంపిక ఆదివారం స్థానిక మినీ స్టేడియంలో జరిగింది. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8 నుంచి 10 వరకు విజయనగరంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.నవీన్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పలువురు అభినందించారు.

అండర్ 14 విభాగం : ఎస్‌కే ఆదిల్, వై.కుషాల్, జె.శ్రీసాయిచరణ్, బి.ఈశ్వర్, వి.జ్యోతిక, ఎస్.రిత్విక, ఎస్.హర్షిణి(ఫాయల్ విభాగం), వి.లేఖన, కె.జగదీష్ చౌదరి, ఎస్.భార్గవ్ శివకార్తికేయ, వై.కుష్వంత్, సీహెచ్ జ్ఞానేశ్వర్(ఈపీ విభాగం), జె.జగదీశ్వర్(సాబర్ విభాగం) **అండర్ 17 విభాగం :** ఎస్‌కే ఆదిల్, వై.భూమి, నర్తన, జి.చైత్ర(ఫాయల్), కె.జగదీష్, ఎండీ అబ్దుల్, పి.అంబరీష్, వై.విశ్వనాథ్, ఎస్‌కే ఆసిఫా(ఈపీ విభాగం)

సీపీఆర్‌తో ప్రాణాలకు రక్షణ


మీడియా ప్రతినిధులకు సీపీఆర్‌లో శిక్షణ

ఒంగోలు టౌన్: గుండెపోటు సమయంలో సీపీఆర్ చేయడం వల్ల ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్‌బాబు అన్నారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఇంటింటికీ సీపీఆర్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక రెడ్‌క్రాస్ భవన్‌లో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుండెపోటు వచ్చిన సమయంలో తక్షణం స్పందించి సీపీఆర్ చేయడం వల్ల ఆగిపోయిన గుండె తిరిగి పనిచేస్తుందన్నారు. అలా చేయడం వల్ల వైద్య సేవలు లభించేంత వరకు గుండెపోటు వచ్చిన వారిని ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ డా.వెంకటేశ్వరరెడ్డి, కోశాధికారి రాఘవ, మహిళా విభాగం కన్వీనర్ కోటేశ్వరమ్మ, కో కన్వీనర్ డాక్టర్ షేక్ మజ్నూ, కార్యదర్శి సుజాత, కోశాధికారి శ్రీదేవి, ఫస్ట్ ఎయిడ్ శిక్షకులు డా.కృష్ణారావు, జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి ఇంటా సంక్షేమం


సంక్షేమ పథకాల లబ్ధి బుక్‌లెట్‌ను అందచేస్తున్న ఎమ్మెల్యే బుర్రా

● ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. పట్టణంలోని 4వ సచివాలయంలో పరిధిలోని మాచవరంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ నవరత్నాల సంక్షేమ పథకాలతో ప్రతి ఇంట్లో సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందచేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హతే ప్రమాణికంగా జల్లెడ పట్టిమరీ సంక్షేమ పథకాలను అందచేసినట్లు చెప్పారు. కరోనా కష్టకాలంలో సైతం సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారన్నారు. టీడీపీ హయాంలో పచ్చచొక్కాల వారికే సంక్షేమ పథకాలు వచ్చేవని గుర్తు చేశారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు 600 హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా మోసం చేసిన చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌లు మాయ మాటలతో మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని వారిని నమ్మొద్దన్నారు. టీడీపీ పాలనలో దోచుకో.. దాచుకో.. పంచుకో ..తప్పా అభివృద్ధి జరిగింది శూన్యమన్నారు. సంక్షేమ లబ్ధిదారులంతా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బుర్రా ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకుని, తక్షణ సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి బుక్‌లెట్‌ను అందచేశారు. తొలుత కౌన్సిలర్ రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మీ నర్సారెడ్డి, బొజ్జా బ్రహ్మయ్య, సూరసాని వెంకటరెడ్డి, జెన్నుపాటి ఇమ్మానియేలు, ప్రభాకర్, ఉప్పు ప్రసాద్, బాలాజీ స్థానిక నాయకులు ఎమ్మెల్యే బుర్రాకు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్దన్, ఆర్ మాణిక్యరావు, పోతిరెడ్డి రాజారెడ్డి, సొసైటీ చైర్మన్ సంగు సుబ్బారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, జిలానీ, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్వీ గోవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు తమ్మినేని సుజాత, జేసీఎస్ పట్టణ కన్వీనర్ వేల్పుల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు శ్రీ రాం సతీష్, దేవరాజ్, నక్కా రామకృష్ణా, రామనబోయిన శ్రీను, అబ్రహం లింకన్, ఎస్‌కే ఖాజా మొహిద్దీన్, దాసరి మురళీ, నాగూర్‌బీ, భారతీ, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు పాల్గొన్నారు. తొలుత వార్డులో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, కౌన్సిలర్ పి.రాజశేఖర్‌రెడ్డి, చైర్మన్ గఫార్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రైతులూ.. జాగ్రత్తలు తీసుకోండి

● జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు


తాళ్లూరులో మిరప రైతులకు జాగ్రత్తలు తెలుపుకున్న వ్యవసాయాధికారి ప్రసాదరావు

ఒంగోలు సెంట్రల్: మిచాంగ్ తుఫాన్ వల్ల రాబోవు రెండు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండి పంటలను కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు సూచించారు. తుఫాన్ ప్రభావం దృష్ట్యా రైతులు తమ పొలంలోని అధిక నీటిని తీసేసేలా చర్యలు చేపట్టాలన్నారు. గాలి వేగం గంటకు 15 కి.మీల కంటే ఎక్కువ ఉంటే క్రిమి సంహారక మందులు పిచికారి చేయవద్దన్నారు. కోతకు వచ్చిన పంటలను కోసుకుని వాటిని జాగ్రత్త పరుచుకోవాలని, కోసిన పంటలను టార్పలిన్ కవర్‌తో కప్పేయాలని సూచించారు. అధిక నీటిని బయటికి పంపించాక పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు లేదా 20 గ్రాముల యూరియా లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని చెప్పారు. శాఖీయ దశలో ఉన్న పెసర, మినుము, శనగ పంటల్లో ఇనుప ధాతు లోపం గమనించినట్లైతే 5 గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్, 1 గ్రాము నిమ్మ ఉప్పును, లేదా చిలేటెట్ ఐరన్ 0.5–1 గ్రాము లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలని చెప్పారు.

కంది: పూత దశలో ఉన్న కందిలో అధిక నీటిని బయటకు పంపిన తర్వాత పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు లేదా 20 గ్రాముల యూరియా లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఈ వాతావరణం పొడ తెగులుకు అనుకూలం. తుఫాన్ తీవ్రత ముగిసిన తర్వాత నివారణకు 2 మి.మీ హెక్సాకోనజోల్ లేదా 1 మి.లీ ప్రొపికోనజోల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

వరి: పొట్టదశ నుంచి పక్వదశలో ఉన్న వరిలో ఆకు ముడత నివారణకు క్లోరిఫైరిపాస్ 2.5 మి.లీ లేదా క్లోరంత్రినిలిప్రోల్ 0.3 మి.లీ లేదా మోనోక్రోటోఫాస్ 36 ఎస్ఎల్ 1.6 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. తుఫాన్ ప్రభావం తగ్గిన తర్వాత అగ్గితెగులు, సుడి దోమ ఆశించే అవకాశం ఉంది. అవసరమయ్యే యాజమాన్య పద్ధతులు పాటించి తెగుళ్లని అరికట్టవచ్చు.

శనగ: విత్తనం నుంచి మొలక దశ ఉన్న శనగలో అధిక తేమ నిల్వ ఉంటే మొదలు కుళ్లు, వేరు కుళ్లు ఆశించే అవకాశం ఉంది. తెగులు సోకకుండా డిసెంబర్ 4వ తేదీలోపు మొక్క మొదలు తడిసేలా 1 గ్రా కార్బెండజిమ్, 3 గ్రా మాంకోజెబ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. రైతులు విత్తనం వేయాల్సిన వారు 5 నుంచి ఏడు రోజులు వాయిదా వేసుకోవాలి.

మినుము, పెసర (ఖరీఫ్ పంట): కోత దశలో ఉన్న మినుము పంట కోసుకుని వాటిని జాగ్రత్త పరుచుకోవాలి. కోసిన పంటను టార్పలిన్ కవర్‌తో కప్పేయాలి. రబీ పంటలో మొలక దశలో శాఖీయ దశకు వచ్చిన పంట విషయంలో నెల రోజుల తర్వాత బూడిద తెగులు ఆశిస్తుంది. నివారణకు కార్బెండజమ్ 1 గ్రాము లేదా 1 మి.లీ కెరతీన్ లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ నీటికి కలిపి పిచికారి చేయాలి.

పత్తి: కాయ ఏర్పడే దశ నుంచి కాయ పగిలే దశలో ఉన్న పత్తిలో అధిక నీటిని బయటకు పంపి పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు లేదా 20 గ్రాముల యూరియా లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. కాయరాలటం గమనించినట్టైతే ప్లానోఫిక్స్ 1 గ్రాము 4.5 లీటర్ల నీటికి కలిపి, సూక్ష్మ (మాక్స్) పోషకాల మిశ్రమం 3 గ్రాములు 10 లీటర్ల నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి. కాయ కుళ్లను గమనిస్తే స్ట్రెప్టో సైక్లిన్ 1 గ్రా లీటరు నీటిలో, కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రాములు 3 రోజుల వ్యవధిలో నాలుగు సార్లు పిచికారి చేయాలి. పత్తి పంట అధిక నీటి నిల్వను తట్టుకోలేదు. వేరు కుళ్లు ఆశించే అవకాశం ఉంది. నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాముల నీటికి కలిపి తడిసేలా చేయాలి.

మిరప: పూత దశలో ఉన్న మిరపలో మొదలు కుళ్లు నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి. బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా హెక్సా కొనజోల్ 2 మి.లీ నీటికి కలిపి పిచికారి చేయాలి. బ్యాక్టీరియా ఆకు మచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రాముల స్ట్రెప్టో సైక్లిన్ 1 గ్రామును 10 లీటర్ల నీటిని కలిపి పిచికారి చేయాలి. కాయకుళ్లు నివారణకు ప్రొపికోనజోల్ 1 మి.లీ లేదా డైఫెన్ కొనజోల్ 0.5 మి.లీ లేదా 2.5 గ్రాముల కాపర్ హైడ్రా ఆక్సైడ్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

కోళ్ల పెంపకం: పెట్ట కోళ్లు గుడ్ల ఉత్పాదక పెంచడానికి 16 గంటలు కాంతి అవసరమని, ఆ సదుపాయాన్ని కల్పించాలి.

పాడి పశువుల పెంపకం: పాడి పశువులను మేతకు బయటకు పంపరాదు. వాటిని సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలి.

ఆటో తిరగబడి నలుగురికి గాయాలు

మద్దిపాడు: ఆటో తిరగబడి నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం ఉదయం గుండ్లాపల్లి సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని లింగంగుంట గ్రామానికి చెందిన కలివాయి వెంకటేశ్వర్లు నాగేంద్రం దంపతులు తమ కుమారుడు రాజేష్, బంధువులతో కలిసి అద్దంకి మండం సింగరకొండ ఆంజనేయస్వామి ఆలయానికి ఆటోలో వెళుతున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ రమేష్ నిద్రమత్తులో ఆటోను వేగంగా నడుపుతూ అదుపు తప్పి భారత్ పెట్రోలు బంకు ఎదురుగా ఫెన్సింగ్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో ఆటోలో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి హైవే పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 ద్వారా ఒంగోలు ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తుల్లో సింగరాయకొండకు చెందిన పత్తిపాటి సుబ్బారాయుడు, ఆయన భార్య సుగుణ, మల్లవల్లి శేషమ్మ ఉన్నారు. ఎస్ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

180 మంది గైర్హాజరు

ఒంగోలు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ ప్రవేశపరీక్షకు 180 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆదివారం 19 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన పరీక్షకు 3826 మందికి గాను 3646 మంది హాజరయ్యారు. స్క్వాడ్ బృందాలు 14 పరీక్షా కేంద్రాలను తనిఖీచేయగా, డీఈఓ 5 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష పూర్తి ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు డీఈఓ వీఎస్ సుబ్బారావు తెలిపారు.